క్లుప్తంగా

చెక్కు పంపిణీ

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ధ గ్రామ పంచాయతీకి చెందిన నేలపట్ల మాధవరెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.60 వేల చెక్కును బుధవారం బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు లబ్ధిదారుడికి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, నాయకులు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, నేలపట్ల సత్యనారాయణరెడ్డి, ఎస్‌కె.నయీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కుష్ఠు'ను గుర్తించాలి

దుమ్ముగూడెం: కుష్ఠు వ్యాధిని ముందే గుర్తిస్తే నష్ట నివారణ చర్యలు చేపట్టి అంగవైకల్యం రాకుండా చేయవచ్చని దుమ్ముగూడెం డాక్టర్ పుల్లారెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31 వరకు చేపట్టనున్న కుష్ఠు గుర్తింపు కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి, అనుమానితుల పేర్లు నమోదు చేస్తారని తెలిపారు. వైద్యాధికారితో వ్యాధి నిర్ధారణ చేయించి ఉచితంగా చికిత్స అందజేయనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

దమ్మపేట: మండలంలోని 'పల్లెపల్లెకు కాంగ్రెస్'అనే నినాదంతో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని వడ్లగూడెం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు కరపత్రాలు ద్వారా మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దిశెట్టి సత్యప్రసాద్, చిన్నశెట్టి చిట్టిబాబు, పాదిలి జ్యోతి, నాగబాబు, షూకూర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

అశ్వాపురం: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు దోసపాటి పిచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రియాంకను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బి.స్వరాజ్యరావు, కె.సందీప్, సత్యనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

వ్యాధులను అరికట్టాలి

అశ్వాపురం: గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధులు అరికట్టాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్.మధుసూదన్‌రెడ్డి, మండల ఆర్గనైజర్ కాంపాటి జీవన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రజాపంథా అశ్వాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రదర్శన చేపట్టి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కోళ్ల వెంకటేశ్వర్లు, కీర్తి కృష్ణ, సమ్మయ్య, శ్రీను, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రూ.2.70 కోట్ల రుణమాఫీ

బూర్గంపాడు: బూర్గంపాడు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో రైతులు తీసుకున్న రూ 2.70 కోట్ల పంటరుణాలను ప్రభుత్వం రుణమాఫీ చేసిందని సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లోని 429మంది రైతులకు తొలివిడతలో 1.23 కోట్లు, 356మంది రైతులకు రూ.1.47 కోట్ల పంటరుణాలను మాఫీ చేసినట్లు ఆయన తెలిపారు. రుణమాఫీకి సంబంధించిన వివరాలను రైతులు పీఏసీఎస్ కార్యదర్శులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. రుణమాఫీ వర్తించిన రైతులు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకువచ్చి తిరిగి రుణాలను పొందవచ్చని, గోదాంలలో రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచామని తెలిపారు.

తేజేశ్వర్‌కు సన్మానం

బూర్గంపాడు: ఇటీవల సివిల్ ఎస్సై కొలువు సాధించిన మోరంపల్లిబంజరకు చెందిన మేడగం తేజేశ్వర్‌రెడ్డిని బుధవారం అదే గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తేజేశ్వర్‌రెడ్డి భవిష్యత్‌లో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బూర్గంపాడు ఎస్సై రాజ్‌కుమార్, చేయూత ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి భవాని, ట్రస్ట్ సభ్యులు తేజ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పరామర్శ

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం గ్రామంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ మూర్తిని నాలుగు మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అరికల తిరుపతి రావు (భద్రాచలం), సోయం రాజారావు (చర్ల), గంపా రాంబాబు (వెంకటాపురం), పెనుమల్ల కృష్ణారెడ్డి (వాజేడు)లు బుధవారం పరామర్శించారు. రోడ్డుప్రమాదానికి గురై కాలు ఆపరేషన్‌తో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సత్యనారాయణమూర్తిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కార్మికుల భుజాలపైనే భారం

- విడుదల కాని మధ్యాహ్న భోజన బిల్లులు
- అప్పులు చేసి నెట్టుకొస్తున్న ఏజెన్సీలు
- నెలలు గడుస్తుండడంతో ఆర్థిక భారం



బిల్లులు విడుదల చేయాలని ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న కార్మికులు (ఫైల్)

దుమ్ముగూడెం: ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పిల్లలకు కడుపునింపాలనే ఆలోచనతో మధ్యాహ్నం భోజన పథకం చేపట్టింది. కాని భోజనం పెట్టే వంట ఏజెన్సీలకు నెలల పాటు బిల్లులు పెండింగ్‌లో ఉంచడంతో వారు అప్పుల పాలవుతున్నారు. మండలంలో 103 పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. ఆ పాఠశాలల్లో కార్మికులకు ప్రభుత్వం సుమారు రూ.26 లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వ నుంచి స్పందన లేదు. తమ సమస్యలను పరిష్కరించాలని గత నెలలో కార్మికులు సమ్మె చేయడంతో ప్రభుత్వం 2022–23 విద్యా సంవత్సరం జనవరి నుంచి ఏప్రిల్ వరకు గుడ్డు బిల్లులు రూ.6.56 లక్షలు, ప్రాథమిక పాఠశాలలకు మార్చి నెల వంట బిల్లు రూ.4.52 లక్షలు, ఉన్నత పాఠశాలలకు ఫిబ్రవరి బిల్లు రూ.60వేలు విడుదల చేసింది. మిగతా నెలల బిల్లులు, కార్మికులకు పెంచుతామని ప్రకటించిన గౌరవ వేతనాన్ని రూ.3వేలు అలాగే పెండింగ్ ఉన్నాయి.

అప్పుల ఊబిలో కార్మికులు..

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బకాయిలు అలాగే ఉండిపోవడంతో కార్మికులు సామగ్రి అరువు తెచ్చిన చోట ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కోడిగుడ్లు పెట్టినందుకు, ఇతర కూరలు వండి పెట్టినందుకు బిల్లులు అందకపోవడంతో అందుకు తెచ్చిన అప్పులు చుట్టుముడుతున్నాయి. మరోవైపు గ్యాస్ ధరలు, కూరగాయాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

ఇవి కాక ప్రస్తుతం విద్యార్థులకు రాగిజావ అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయి. పాతవాటికే బిల్లులు అడుగునపడుతుంటే ఇప్పుడు కొత్త ఖర్చులు తలకు మించిన భారంగా మారాయి. ఈ నేపథ్యంలో కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు విడుదల చేయాలని గతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెలు సైతం చేపట్టినప్పటికీ ప్రభుత్వంలో చలనం కలగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

గతంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు రెగ్యులర్‌గా బిల్లులు చెల్లించేవారు. ఇప్పుడు విద్యాశాఖకు నిధులు కేటాయించకపోవడంతో బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వంట ఏజెన్సీల బిల్లులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పాఠశాలల్లో వంట బంద్ చేసే పరిస్థితులు ఎదురవుతాయని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

బకాయిలు విడుదల చేయాలి..



పూర్తి ఏజెన్సీ మండలమైన దుమ్ముగూడెంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు రాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోతే సామగ్రి అరువు తెచ్చిన చోట ఇబ్బంది అవుతోంది. కార్మికుల్లో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే ఉన్నారు. బకాయిలు వెంటనే విడుదల చేయాలి.

– కొర్సా చిలకమ్మ, సీఐటీయూ మండల కన్వీనర్

అప్పులు కూడా ఇవ్వడం లేదు..



ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడంతో కిరాణా దుకాణాల దగ్గర మధ్యాహ్న భోజన సామగ్రికి తెచ్చిన అప్పు పేరుకుపోయింది. ఇప్పుడు కొత్త అప్పులు ఇవ్వని పరిస్థితి నెలకొంది. పాత అప్పు చెల్లించాకే సరుకులు ఇస్తామని దుకాణదారులు తేల్చి చెబుతున్నారు. బిల్లుల బకాయిలు చెల్లిస్తే ఈ పరిస్థితి మెరుగవుతుంది.

– పూనెం కుమారి, వంట ఏజెన్సీ కార్మికురాలు

నిధులు విడుదల చేయాలి



మండలం నుంచి మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులు చేసి పంపుతున్నాం. కానీ నిధులు విడుదల కావడం లేదు. ప్రభుత్వం స్పందించి బడ్జెట్ విడుదల చేస్తే వంట ఏజెన్సీల ఖాతాలో నగదు జమ అవుతుంది. వారి అప్పులు తీరడంతోపాటు పథకం ముమ్ముందు సుజావుగా సాగేందుకు అవకాశం ఉంటుంది.

– సున్నం సమ్మయ్య, మండల విద్యాశాఖాధికారి

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



దీక్ష చేస్తున్న బాధిత మహిళలతో మాట్లాడుతున్న సత్యవతి

భద్రాచలంటౌన్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం నాలుగు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి అన్నారు. పట్టణంలోని మనుబోతుల చెరువు ప్రాంతంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు తమకు కేటాయించాలని స్థానిక మహిళలు చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష శిబిరాన్ని బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా దీక్ష చేస్తున్న మహిళలకు ఏమైన జరిగితే ప్రభుత్వానిదే బాధ్యతని హెచ్చరించారు. కార్యక్రమంలో నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రామోహన్‌రావు, సత్యనారాయణ, నరసింహారావు, శ్రీనివాస్, వెంకటసుబ్బయ్య, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్



ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు మొక్క అందజేస్తున్న తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్

అన్నపురెడ్డిపల్లి: ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన జగదీశ్వరప్రసాద్ బుధవారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును తాటి సుబ్బన్నగూడెంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మెచ్చా తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

భద్రాచలంఅర్బన్: ఆటో డ్రైవర్లు తమ ఆటోలను నడిపే సమయంలో తప్పకుండా నిబంధనలు పాటించి ప్రజల మన్ననలు పొందాలని భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ట్రాఫిక్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. సుమారు 15 యూనియన్లకు సంబంధించిన 90 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ.. రోడ్లపై ఆటోలను ఇష్టారాజ్యంగా నిలిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయాణీకులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, అసభ్యకరంగా ప్రవర్తిస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు. నిర్దేశించిన ధరలకే ప్రయాణికుల నుంచి చార్జీలు వసూలు చేయాలని, ఆటోలలో ఉన్న సౌండ్ బాక్సులు తొలగించాలని సూచించారు. డ్రైవర్లు యూనిఫాంను తప్పక ధరించాలని చెప్పారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ ఉండాలని, టాప్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్ కనబడేలా ఉండాలని అన్నారు. మద్యం సేవించి ఆటోలు నడప కూడదని ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ అవగాహన కల్పించారు. పట్టణంలోని ఆటో యూనియన్ల నాయకులు, సభ్యులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల చేయూత



భద్రాచలంఅర్బన్: విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

భద్రాచలంఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో సారపాక గాంధీనగర్‌కు చెందిన విద్యార్థిని పి.రమ్య ఉన్నత చదువు కోసం బుధవారం ఆర్థిక సాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రమ్య.. కాకతీయ యూనివర్సిటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో సీటు సంపాధించింది. అక్కడి చదువుల నిమిత్తం లయన్స్ క్లబ్ రూ.14,500 ఆర్థిక సహకారం అందజేసింది. రానున్న మూడు సంవత్సరాలకుగాను రమ్య చదువుకు తామే ఖర్చులు భరించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గుండు శరత్, కోశాధికారి జి.భరత్ కుమార్, వై.సూర్యనారాయణ, జీఎస్ శంకర్‌రావు, ఎండి.అలీఖాన్, డాక్టర్ సుదర్శన్ రావు, డాక్టర్ జయభారతి, జక్కం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని పైదిగూడెం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి గడ్డం యువరాజుకు ఎస్ఆర్ఐ మాజీ తానా అధ్యక్షుడు నన్నపనేని మోహన్ సత్వర సాయంగా రూ.75 వేలు అందజేశారు. కాంచీపురం ఐఐటీలో సీటు పొంది ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న మోహన్.. నేరుగా విద్యార్థికి ఫోన్ చేసి మాట్లాడారు. అండగా ఉంటానని ధైర్యమిచ్చి సాయం అందించారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల గ్రామానికి చెందిన కుంజా అనుశ్రీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చదివేందుకు రాజస్థాన్‌లోని ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందింది. గిరిజన నిరుపేద కుటుంబం కావడంతో చదువు ఖర్చుల కోసం భారజల కర్మాగారం గౌతమీస్మార్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థిని అడ్మిషన్ ఫీజుకు బుధవారం రూ.15వేలు అందజేశారు. తన చదువుకు దాతలు ఆర్థిక చేయూత అందించాలని విద్యార్థిని కోరుతోంది. ఫౌండేషన్ సభ్యులు కె.సోమయ్య, ఎం.ప్రదీప్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం ప్రైమరీ స్కూల్‌కు రూ.40వేల ఆర్థికసాయంతో పూర్వవిద్యార్థులు కళావేదికను ఏర్పాటు చేశారు. 1985–86 పదో తరగతి బ్యాచ్‌మేట్స్ కళావేదిక నిర్మాణానికి ఆ నగదును హెచ్ఎమ్ త్రిమూర్తులకు అందజేశారు. పూర్వ విద్యార్థుల వితరణను పలువురు అభినందించారు.

దమ్మపేట: మండల పరిధిలోని గండుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వేముల వెంకటేశ్వర్లు.. అదే పాఠశాల అభివృద్ధి కోసం విరాళంగా రూ.10 వేల విలువైన చెక్కును హెచ్ఎం కీసర లక్ష్మికి అందజేశారు. ఉపాధ్యాయుడిని జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, సర్పంచ్ మడకం సుశీల, ఉపసర్పంచ్ జూపల్లి ఉపేంద్ర, విద్యాకమిటీ చైర్మన్ జ్యోతి, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

వృద్ధాశ్రమాల్లో వితరణ

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన వేములపల్లి కృష్ణార్జున్‌రావు, వేములపల్లి రమేష్‌ల మాతృమూర్తి వేములపల్లి హైమావతి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు, కాంట్రాక్టర్లు బుధవారం సీతరాంపురం గ్రామంలోని మానవీయ, జగ్గారం గ్రామంలోని ఆరీఫా–రోష్ని వృద్ధాశ్రమాల్లో పాలు, పండ్లు, బియ్యం, నిత్యావసర వస్తువులు వితరణ చేశారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, అనిల్, రవి, సంపత్, రాము పాల్గొన్నారు.

కళ్ల కలకకు హోమియో మందు

భద్రాచలంఅర్బన్: కళ్ల కలకను నిరోధించడానికి హోమియో మందు అందుబాటులో ఉన్నట్లు స్థానిక ప్రభుత్వ హోమియో వైద్యశాల (ఏరియా ఆస్పత్రి) డాక్టర్ బి. వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రజలు తమను సంప్రదిస్తే మందు అందజేస్తామని తెలిపారు.

దరఖాస్తుల విచారణ

అశ్వారావుపేటరూరల్: గృహలక్ష్మి పథకం కోసం వచ్చిన దరఖాస్తులపై మండలంలో బుధవారం నుంచి విచారణ ప్రారంభించారు. ఆసుపాక, వినాయకపురం, నారాయణపురం, మద్దికొండ, కన్నాయిగూడెం, అనంతారం, కేశప్పగూడెం, అశ్వారావుపేటతోపాటు మిగిలిన అన్ని గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. దరఖాస్తుల విచారణను ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తి చేసి అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నారు.

సర్వే నిర్వహించాలి

అశ్వాపురం: మండలంలో ప్రభుత్వ భూములపై జాయింట్ సర్వే నిర్వహించాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవికి భారతీయ సర్వ సమాజ్ మహాసంఘ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. జగ్గారం గ్రామంలో సర్వే నంబర్ 400, 400/2, చింతిర్యాల గూడెంలో 190/1, 190/2 భూముల్లో సర్వే చేయించి, అర్హత ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు విన్నవించారు. బీఎస్ఎస్ఎం నాయకులు ఇస్రం శ్రీనివాసరావు, కేవీఆర్.మూర్తి, గార్లపాటి సుధాకర్, ఊకె చిట్టెమ్మ, సోమలింగం, కంభాల వెంకన్న, ముత్తయ్య, పాయం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అభివృద్ధి పనులు



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బాలసాని, అధికారులు

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో అభివృద్ధి పనులకు త్వరగా ప్రణాళికలు రూపొందించి పూర్తి చేయాలని అధికారులకు మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలసాని లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని సెంట్రల్ లైటింగ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు చేపట్టనున్న పనులకు సంబంధించి ఏర్పాట్లను ఆయన పంచాయతీరాజ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి కూనవరం రోడ్డులోని ఆర్‌టీఓ కార్యాలయం వరకు, అంబేడ్కర్ సెంటర్ నుంచి రాజుపేట కాలనీ వరకు డివైడర్స్, సెంట్రల్ లైటింగ్ సిస్టంకు ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి ఆచరణలో పెట్టాలని అన్నారు. అనంతరం కొత్తమార్కెట్‌లోని సంత జరిగే స్థలంలో కూరగాయల మార్కెట్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ షెడ్లు నిర్మించుటకు స్థలాన్ని పరిశీలించి వీటికి ఎస్టిమేట్లను త్వరగా తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డివిజనల్ అధికారి రాజేష్ రావు, భద్రాచలం, దుమ్ముగూడెం ఏఈలు, వైశ్య నాయక్, వంశి, శ్రీరాం నాయక్ భద్రాచలం గ్రామ పంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లు , బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరికెళ్ల తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కొండిశెట్టి కృష్ణమూర్తి, నాయకులు చింతాడ చిట్టిబాబు, రాంబాబు, యశోద నగేష్ పాల్గొన్నారు.

గొత్తికోయగూడెంలో వైద్యశిబిరం

చండ్రుగొండ: మండలంలోని మారుమూల బెండాలపాడు శివారు కనకగిరి గుట్టలప్రాంతంలో ఉన్న ఎర్రబోడు గొత్తికోయగూడెంలో చండ్రుగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ తనుజా ఆధ్వర్యంలో రక్తనమూనాలను సేకరించారు. వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ శిబిరంలో హెల్త్‌సూపర్‌వైజర్ యండి.ఇమాం, సిబ్బంది, పద్మ, పుల్లమ్మ, శ్రీనివాస్, ఆశవర్కర్‌లు కే రాజేశ్వరి, నాగమణి, వాలంటీర్ వెంకట్ పాల్గొన్నారు.

గుండాల: ఏ మాత్రం అనారోగ్యానికి గురైనా వెంటనే స్థానిక ఆస్పత్రికి వచ్చి వైద్యం పొందాలని వైద్యాధికారి మనేష్‌రెడ్డి, ఏఎన్ఎమ్ అరుణ కుమారి సూచించారు. మండలంలోని చెట్టుపల్లి పంచాయతీలో లింగాపురం గ్రామంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరాలతో ఉన్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. మలేరియా, డెంగీ రాకుండా దోమతెరలను వాడాలని, ఇంటి పరసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లెప్రసీ వ్యాధిపై ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చర్ల: మండలంలోని సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాల పరిధిలోని ఎర్రబోరు, బోదనెల్లి గ్రామాల్లో వైద్యాధికారిణి డాక్టర్ దివ్య నయన నేతృత్వంలో బుధవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో ఇద్దరికి జ్వరాలు ఉన్నట్లు తేలండంతో వారి రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి దివ్యనయన పలు జాగ్రత్తలు వివరించారు. శిబిరాల్లో డీపీఎంఓ సీహెచ్ సత్యనారాయణ, హెచ్‌ఈఓ బాబూరావు, హెల్త్ సూపర్‌వైజర్ కనకదుర్గ, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, హెల్త్ అసిస్టెంట్ వరప్రసాద్ రాజేశ్వరి, ఆశా వర్కర్లు పోతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ అభినందనలు



ప్రశంసాపత్రాన్ని కలెక్టర్‌కు చూపుతున్న ఎంపీఓ ముత్యాలరావు

దుమ్ముగూడెం: సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఉత్తమ మండల పంచాయతీ అధికారిగా అవార్డు అందుకున్న ముత్యాలరావును కలెక్టర్ ప్రియాంక ఆల అభినందించారు. ఎంపీఓ బుధవారం కలెక్టర్‌ను కలిశారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని, మండలంలో పంచాయతీలను మరింత అభివృద్ధి బాటలో నడిపించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

'బంధు' పథకాల్లో కమీషన్లు

చండ్రుగొండ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత, బీసీ బంధు పథకాలు బీఆర్ఎస్ నాయకులకు కమిషన్ల పథకాలుగా మారాయని టీపీసీసీ సభ్యురాలు వగ్గెల పూజ ఆరోపించారు. మండలంలోని రావికంపాడు గ్రామంలో బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు.

గ్రామంలో కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకే బీసీ బంధు లబ్ధి చేకూరిందని విమర్శించారు. అదికూడా లక్ష రూపాయలకు రూ.10 నుంచి రూ.30 వేల వరకు కమీషన్ తీసుకుని ఇచ్చారని అన్నారు. అసలైన లబ్ధిదారులకు మొండి చేయి చూపారన్నారు. ఆందోళనలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు కేశబోయిన నర్సింహారావు, బి.కోటేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు, పి.సతీష్, రహీం, కిషన్, బొర్రా సురేష్, అన్వర్, రాందాస్ పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

చర్ల: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గిరిజన సొసైటీ పేరిట ఇసుక క్వారీల్లో కొనసాగుతున్న బినామీ విధానంపై సీబీసీఐడీతో విచారణ జరిపించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం చర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక క్వారీల నిర్వహణలో బినామీలు దొడ్డిదారిన ప్రవేశించి, అమాయక గిరిజనులను లోబర్చుకుంటున్నారని, అధికారులు విచారణ జరిపి అక్రమార్కులను చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో పలువురు జీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ



వాలీబాల్ కిట్లు అందజేస్తున్న పోలీసులు

గుండాల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ రవీందర్ అన్నారు. బుధవారం మండలంలోని వెన్నెలబైలు సర్వాపురం గుంపు వద్ద యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో యువత మద్యం, గుట్కా, గంజాయి లాంటి చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని సూచించారు. చదువుతో పాటు, క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశించారు. ఆ గుంపులోని విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో గుండాల ఎస్సై రాజశేఖర్, కాచనపల్లి ఎస్సై గిరిదర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

మణుగూరురూరల్: బడుగు, బలహీన, నిరుపేద ప్రజల ఉద్యమ స్ఫూర్తి ప్రదాత, ప్రజా యుద్ధనౌక గద్దర్ అని తెలంగాణ ఉద్యమకారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న తెలంగాణ విద్యార్థి అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో బుధవారం గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతర వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో, దళితుల హక్కుల కోసం ఆయన అందించిన స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, విద్యార్థి జేఏసీ నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు జంపాల శ్రీనివాస్, జీవి, అక్కినపల్లి సైదులు, జగన్న, మునిగెల రమేష్, వలసాల వెంకట రామారావు, శంకరయ్య, చంద్రమౌళి, బొల్లోజు అయోధ్య, మున్నా లక్ష్మీకుమారి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ జిల్లాగా నామకరణం చేయాలి

ప్రజాఉద్యమనేత, ప్రజా గాయకుడు గద్దర్ పుట్టిన జిల్లాకు ఆయన పేరుపెట్టాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అల్లెం కోటి రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట తెలంగాణ విద్యార్థి అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించిన గద్దర్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన ఆశయాలకు సాధించినప్పుడే మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. బీఎస్పీ నాయకులు పీక మల్లేశం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నివాళి..

మణుగూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న విద్యార్థి అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో బుధవారం ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు డాక్టర్ చందా సంతోష్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, సమితిసింగారం సర్పంచ్ బచ్చల భారతిలు హాజరై గద్దర్ చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం సుధాకర్ రెడ్డి, గుండాల శివ, శ్రీను, కలబోయిన నాగరాజు, కలబోయిన వంశీ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయాలి

బూర్గంపాడు: ప్రజా యుద్ధనౌక, ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆయనకిచ్చే గౌరవం అన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -79979 58226 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి – పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416